ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY

# ప్రయోగాలతో నూతన ఆవిష్కరణలు

- జేఎన్‌టీయూకే దశాబ్ది వేడుకలో ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్ భాస్కర్



దశాబ్ది వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన టెక్నో ఫెయిర్‌లో ఓ విద్యార్థి రూపొందించిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఉదయ్ భాస్కర్

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: విద్యార్థి ఆలోచనలకు అనుగుణంగా విద్యాభ్యాసం జరగాలని ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్ భాస్కర్ పేర్కొన్నారు. ప్రయోగాల ద్వారా నూతన ఆవిష్కరణలు సాధ్యమన్నారు. కాకినాడలోని జేఎన్‌టీయూ దశాబ్ది వేడుకలు ఉపకులపతి ఎం.రామలింగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అతిపెద్ద వర్సిటీగా పేరుగాంచిన జేఎన్‌టీయూకే మరింత అభివృద్ధి చెందాలని, దానికి అధ్యాపకుల ఐక్యత ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్నారని, అందువల్లనే గ్రూప్-1 పరీక్షలో తెలుగు పేపరులో అర్హత తప్పనిసరి చేసి ఇటీవల జీవో విడుదల చేసినట్లు చెప్పారు. ఆంగ్లంతో పాటు తెలుగులోనూ అర్హత తప్పనిసరి చేశామన్నారు. వీసీ ఎం.రామలింగరాజు మాట్లాడుతూ వర్సిటీలో పరిసరాల పచ్చదనం, స్మార్ట్ క్యాంపస్, రీసెర్చ్ కల్చర్, స్టార్టప్స్, ఇంక్యుబేషన్, పారదర్శక పరిపాలన, అనుబంధ కళాశాలల్లో మౌలిక సదుపాయాల పెంపు, రీసెర్చ్ సెంటర్లను నెలకొల్పేలా కృషి చేస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ వి.వి.సుబ్బారావు మాట్లాడుతూ.. పలు విదేశీ విశ్వవిద్యాలయాలతో అనుసంధానమవుతూ నూతన కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. గ్లోబల్ మార్కెటింగ్‌కు అనుగుణంగా ఆర్-19 పాఠ్య ప్రణాళికను త్వరలో రూపొందించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూకే విజయాలతో కూడిన సంచికను విడుదల చేశారు. మాజీ వీసీలు, విద్యావేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ మాజీ ఉప కులపతులు అల్లం అప్పారావు, వి.ఎస్.ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.